

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



**పోలవరంపై రాజీ లేదు**

45.72 మీటర్ల ఎత్తుతోనే ప్రాజెక్ట్ నిర్మాణం

6



5 లో

## దీపం-2తో పండుగ కాంతివంతం

శుభాకాంక్షలు చెబుతూ సీఎం చంద్రబాబు ట్వీట్



చైతన్య రథం పాఠకులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు. పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని నేడు 'చైతన్యరథం' ఈ -పత్రికకు సెలవు. కనుక శుక్రవారం పత్రిక వెలువడదు. పునఃదర్శనం శనివారం. పాఠకులు గమనించగలరు.

# వచ్చేదంతా.. ఏఐ పాలన!



- మెరుగైన సేవలకు అనువైన మార్గం
- సమర్థ వినియోగంతో సమస్యలకు చెక్
- భారత్‌లో డాటా విప్లవానికి ఏపీ నాంది
- రాష్ట్రానికి 100 బిలియన్ల పెట్టుబడుల లక్ష్యం
- రాజకీయాల్లో ఎత్తుపల్లాలు చూశా...
- నా భవిష్యత్ గమనాన్ని ప్రజలే నిర్ణయిస్తారు
- రాజకీయాల్లో సంక్లిష్టత నెలకొంటోంది..
- ఆలోచించి అడుగులేయాల్సిన తరుణమిది..
- ఐటి సర్వ్ అలయెన్స్ సినర్జీ సమ్మిట్ ఫైర్‌సైడ్ చాట్‌లో మంత్రి లోకేష్

దైనందిన పాలనకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అనుసంధానించి.. సమర్థ వినియోగంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యం. గవర్నెన్స్‌లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఏఐని వినియోగించాలని భావిస్తున్నాం. గవర్నెన్స్, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్ తదితర రంగాల్లో ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సంసిద్ధులవుతున్నాం. భవిష్య భారత్ డాటా విప్లవంవైపు దూసుకెళ్తోంది. డాటా సేవల రంగంలో 300 బిలియన్ డాలర్ల పెట్టుబడులు దేశంలోకి రాబోతున్నాయి. అందులో వంద బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించాలన్నది ఏపీ ప్రణాళిక. రాష్ట్రాభివృద్ధి విషయంలో ఇతర రాష్ట్రాలతో కాదు, ఇతర దేశాలతో పోటీ పడేందుకు అనుగుణంగా పాలసీలు, ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. సవాళ్లను అవకాశాలుగా తీసుకుని పనిచేయడం మాకు అలవాటైంది. ఏఐ వినియోగంతో పాలనాపరమైన సమస్యలను అధిగమించడానికి రాష్ట్రంలో ఏఐ వర్సిటీ ఏర్పాటు చేయనున్నాం. ఇది అంతర్జాతీయస్థాయి నిపుణులను తయారుచేస్తుందని మా విశ్వాసం.

3 లో



సేల్స్ ఫోర్స్ ఏఐ సిఈఓ క్లారా షిహ్‌తో మంత్రి లోకేష్ భేటీ



పెప్సికో మాజీ సిఈఓ ఇంద్రా నూయితో మంత్రి లోకేష్ భేటీ



రెవేచర్ సీఈఓ అశ్విన్ భరత్‌తో లోకేష్ భేటీ

## కౌంట్‌డౌన్ కామెంట్రీ



సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం రాష్ట్రంలో అమల్లోకి వచ్చింది. దీపం-2 పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసింది. నేడు దీపావళి పండుగ రోజున శ్రీకాకుళం జిల్లాలో సీఎం చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు.



# ఏటా 15శాతం వృద్ధి రేటు

- 2047నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఏపీ
- విజన్ డాక్యుమెంట్‌పై నీతి ఆయోగ్ భేటీలో సీఎం చంద్రబాబు

5

ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047 ప్రణాళిక రూపొందిస్తున్నాం. 2047నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీతో ఏపీ అభివృద్ధే లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్‌ను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో సిద్ధమవుతోంది. పేదరిక నిర్మూలన, ఈజ్ ఆఫ్ లివింగ్, సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, డెమోగ్రాఫిక్ మేనేజిమెంట్, డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌వంటి గ్రోత్ ఇంజిన్లతో వృద్ధిరేటు సాధించేలా ఈ ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయి.

-చంద్రబాబు నాయుడు

ఐదేళ్లుగా కమ్ముకున్న
చీకట్లను మట్టుబెట్ట!
ఎదురొచ్చెను దీపం-2
వెలుగులెన్నొ వెదజల్లగ!!

పొగమారిన బతుకులకు
ఉచితముగా గ్యాసునిచ్చి!
కట్టెపొయ్యి కష్టాలను
తీర్చెనుగా దలతలచి!!

కష్టాలకు ఎదురీదిన
సంక్షేమం విడువలేదు!
హామీలను నెరవేర్చగ
చంద్రన్నకు తిరుగులేదు!!

భవిష్యత్‌కు బాటలేస్తు
నడిపించును విజనరీ!?
విధ్వంసపు చీకట్లను
తరిమికొట్టు గడుసరి!!

-మహాదేవ

# అమల్లోకి దీపం-2

- సూపర్ సిక్స్‌లో భాగంగా ఇక ఉచిత సిలిండర్లు
- రూ.2,684 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- సర్కారుపై తొలి విడత భారం.. రూ.894 కోట్లు
- పెట్రోలియం సంస్థలకు చెల్లించిన ముఖ్యమంత్రి
- 1న శ్రీకాకుళంలో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం



2



## తితిదే ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు

24మందితో పాలక మండలి ఏర్పాటు

- వివరాలు 6 లో..




# డ్వాక్రాలు బలోపేతం

- వచ్చే ఐదేళ్లల్లో పేదల ఆదాయం రెట్టింపునకు ప్రణాళికలు
- నిజమైన లబ్ధిదారుల ఎంపికకు ఎస్‌హెచ్‌జి ప్రొఫైలింగ్ యాప్
- జనవరి నుంచి అమరావతి రాజధాని పనులు
- రాష్ట్ర పురపాలక మంత్రి పి. నారాయణ వెల్లడి

- వివరాలు 8 లో..

# పక్షం రోజుల్లో బీమా చెల్లింపులు

- వరదల్లో నష్టపోయిన వాహనదారులకు ఉపశమనం
- బెజవాడకు వరదల నుంచి శాశ్వత పరిష్కారం..
- బుడమేరు వరద నివారణకు డీపీఆర్ సిద్ధం చేయండి
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం



అమరావతి (చైతన్య రథం): బుడమేరు వరదల్లో దెబ్బతిన్న వాహనదారులకు బీమా చెల్లింపులకు సంబంధించి పెండింగులో ఉన్న దరఖాస్తులను 15 రోజుల్లోపు పూర్తి చేయాలని బీమా సంస్థల ప్రతినిధులను, ప్రభుత్వ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ఇటీవల వచ్చిన వరదలకు సంబంధించి చేపట్టిన సహాయక చర్యలు,బాధితులకు పంపిణీ చేసిన పరిహారంపై అధికారులతో సచివాలయంలో బుధవారం సీఎం సమీక్ష నిర్వహించారు.వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతోనూ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆ జిల్లాల పరిస్థితిని సమీక్షించారు. ముందుగా అధికారులు ప్రభుత్వం సహాయంపై ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం 4,21,698 మందికి రూ.625 కోట్లు ఆర్థిక సాయం అందించామని తెలిపారు. కేవలం 70 మందికి మాత్రమే ఇంకా పరిహారం అందలేదని.. అది కూడా వారి బ్యాంక్ ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడం వల్లనే సమస్య వచ్చిందని తెలిపారు. మరో 200 దరఖాస్తులు ఇప్పటికీ పరిశీలనలో ఉన్నాయని, వాటిలో అర్హులకు ప్రభుత్వ సాయం అందిస్తామని వివరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరద బాధితులకు ప్రభుత్వం సాయం చేసిందని... గతంలో ఇంత మొత్తంలో సాయం చేసిన సందర్భం ఎన్నడూ ఎక్కడాలేదన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందించాలనే ప్రయత్నంలో తాము ఉన్నామని... చివరి బాధితుడి వరకు ప్రభుత్వ సాయం చేరుతుందని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో వరదలకు నష్టపోయిన వాహనదారులకు బీమాచెల్లింపు దరఖాస్తుల్లో ఇంకా 262పెండింగులో ఉండటంపై సీఎం అసంతృప్తి వ్యక్తంచేశారు. గతంలో విశాఖపట్నంలో హుదుద్ తుపాన్ వచ్చిన సమయంలో కేవలం నెల రోజుల్లోపే బాధితులకు బీమా సొమ్మును అందించామని, ఆ తరహాలో ఇప్పుడు ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. పెండింగులో ఉన్న క్లెయిమ్ దరఖాస్తులన్నీ 15 రోజుల్లో పరిష్కరించి బాధితుల ఖాతాలో బీమా సొమ్ము జమ చేయాలని బీమా సంస్థల ప్రతినిధులు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా లబ్ధిదారుల జాబితాను వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. భవిష్యత్తులో బెజవాడకు వరద ప్రమాదం లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. దీనికి సంబంధించి తక్షణం డీపీఆర్ రూపొందించాలన్నారు. కాలువ గట్లకు, కరకట్టలకు గండ్లు పడకుండా కట్టుదిట్ట చర్యలు చేపట్టడానికి, దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు సంబంధించి కేంద్ర నుండి నిధులు గ్రాంటు రూపంలో వస్తాయని, ఆ నిధులను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో వరద ముంపు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆపరేషన్ బుడమేరులో భాగంగా ఆ ప్రాంత ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించి వారికి శాశ్వత పునరావాసం కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. వరదల్లో దెబ్బతిన్న చిరు వ్యాపారులకు చెల్లించాల్సిన పరిహారాన్ని తక్షణం విడుదల చేయాలని ఆదేశించారు. వరదలకు ప్రజలు ఎన్ని కష్టాలు పడ్డారో స్వయంగా చూశానని.... ఏ ఒక్కరికీ సాయం అందకుండా ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

# అమల్లోకి దీపం-2




- సూపర్ సిక్స్‌లో భాగంగా ఇక ఉచిత సిలిండర్లు
- రూ.2,684 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- సర్కారుపై తొలి విడత భారం.. రూ.894 కోట్లు
- పెట్రోలియం సంస్థలకు చెల్లించిన ముఖ్యమంత్రి
- 1న శ్రీకాకుళంలో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం

అమరావతి (చైతన్య రథం): సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం రాష్ట్రంలో అమల్లోకి వచ్చింది. దీపం-2 పథకానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఎన్నికలముందు కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్-6 హామీల్లో భాగంగా యేడాదికి 3 గ్యాస్ సిలిండర్ల పథకానికి ఖర్చయ్యే నిధులను సీఎం చంద్రబాబు చేతులమీదుగా గ్యాస్ సరఫరా చేసే పెట్రోలియం సంస్థలకు అంద జేశారు.బుధవారం సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఈ సబ్సిడీ మొత్తాన్ని అందించా రు. ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అయ్యే రూ.2,684కోట్ల ఖర్చుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా ప్రభుత్వం పెట్రోలియం సంస్థలకు చెక్కు అందజేసింది. రూ.2,684 కోట్ల మంజూరుకు అంగీకారం తెలుపుతూ.. మొదటి సిలిండర్‌కు ఖర్చయ్యే రూ.894 కోట్లు పెట్రోలియం సంస్థలకు అందించింది. దీపం-2 పథకంలో భాగంగా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ప్రభుత్వం పేద ప్రజలకు అం దించనుంది. ఏడాదికి మూడు విడతల్లో ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లకు అయ్యే సొమ్మును విడుదల చేయనుంది. 29 నుంచి ప్రభుత్వం ఈ పథకం కింద గ్యాస్ బుక్ చేసుకునే అవకాశాన్ని లబ్ధిదారులకు కల్పించింది. గ్యాస్ సిలిండర్ అందిన 48గంటల్లో లబ్ధిదారులు సిలిండర్‌కు వెచ్చించిన సొమ్ము వారి ఖాతాలో జమ కానుంది. కేంద్రం ఇచ్చే రూ.25ల రాయితీపోను మిగిలిన రూ.876లను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ఈ పథకం అమలుకు ప్రతియేటా రూ.2,684 కోట్లు ప్రభుత్వంపై ఆర్థిక భారంపడనుంది. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు తెనాలి నుంచి వచ్చిన దీపం పథకం లబ్ధిదారు జాలమ్మ, ఏలూరు నుంచి వచ్చిన లబ్ధిదారు భవానీ, విజయవాడ నుంచి వచ్చిన లబ్ధిదారు మంగతాయారు, సివిల్ సప్లై శాఖ అధికారులు, పెట్రోలియం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ముందంతా.. ఏఐ పాలన!



- మెరుగైన సేవలకు అనువైన మార్గం
- సమర్థ వినియోగంతో సమస్యలకు చెక్
- భారత్‌లో డాటా విప్లవానికి ఏపీ నాంది
- రాష్ట్రానికి 100 బిలియన్ల పెట్టుబడుల లక్ష్యం
- రాజకీయాల్లో ఎత్తుపల్లాలు చూశా...
- నా భవిష్యత్ గమనాన్ని ప్రజలే నిర్ణయిస్తారు
- రాజకీయాల్లో సంక్లిష్టత నెలకొంటోంది..
- ఆలోచించి అడుగులేయాల్సిన తరుణమిది..
- ఐటి సర్వ్ అలయెన్స్ సినర్జీ సమ్మిట్‌లో మంత్రి లోకేష్

లాస్ వేగాస్ (యుఎస్‌ఎ): దైనందిన పాలనలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సమర్థ వినియోగంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్య మని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. లాస్‌వేగాస్‌లోని ఐటీ సర్వ్ అలయెన్స్ సినర్జీ సదస్సుకు విశిష్ట అతిథిగా హాజరైన లోకేష్... ఫైర్ సైడ్ చాట్‌లో పారిశ్రామికవేత్త రవి తొట్టెంపూడి అడిగిన ప్రశ్నలకు వివరణాత్మకంగా సమాధానాలిచ్చారు.

23 దేశాల నుంచి 2300మంది పారిశ్రామికవేత్తలు సదస్సుకు హాజరయ్యారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ... 1992లో విడుదల చేసిన ఒక జీఓ కారణంగా ఇంటర్మీడియట్‌లో దివ్యాంగులు కేవలం 5 సబ్జెక్టుల్లో మాత్రమే పరీక్షలు రాసే విధానంవల్ల ఇటీవల రాష్ట్రానికి చెందిన విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. నీట్‌లో ప్రతిభ కనబర్చిన దివ్యాంగులు ఈ విషయాన్ని నా దృష్టికి తెచ్చారు. వెంటనే అధికార యంత్రాంగాన్ని కదిలించి ఫ్రెష్‌గా జీఓ విడుదల చేయడంతో వారికి ఐఐటీ, ఎన్‌ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు లభించాయి. అధికారులు చొరవ చూపకపోతే వారి పరిస్థితి ఏమయ్యేది? గవర్నెన్స్‌లో ఇటువంటి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఏఐని వినియోగించాలని భావిస్తున్నాం. గవర్నెన్స్, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్ తదితర రంగాల్లో ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని లోకేష్ స్పష్టం చేశారు.

## అభివృద్ధిలో ఇతర దేశాలతో పోటీపడతాం

రానున్న రోజుల్లో భారత్‌లో డాటా విప్లవం రాబోతోంది. డాటాసేవల రంగంలో 300 బిలియన్ డాలర్ల పెట్టుబడులు దేశంలోకి రాబోతున్నాయి. అందు లో వంద బిలియన్ డాలర్లను ఏపీకి రప్పించేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రాభివృద్ధి విషయంలో ఇతర రాష్ట్రాలతో కాకుండా ఇతర దేశాలతో పోటీపడతాం. సవాళ్లను అవకాశాలుగా తీసుకుని పనిచేయడం మాకు అలవాటైంది. ఇటీవల కృష్ణానదికి గత 248 సంవత్స రాల్లో ఎన్నడూ లేనివిధంగా వరదలు వచ్చాయి. ఆ సమయంలో వ్యవసాయానికి వాడే డ్రోన్లను వరద బాధితులకు సాయం అందించేందుకు వినియోగిం చాం. తమ ప్రయత్నం విజయవంతం కావడంతో డ్రోన్లద్వారా వివిధ రంగాల్లో సేవలు అందించడంపై దృష్టి సారించాం. ఇటీవల విజయవాడలో నిర్వహించిన డ్రోన్ సమ్మిట్‌లో 5 గిన్నెస్ రికార్డులు రావడం ఆనంద కరం. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రత్యేక డ్రోన్ పాలసీ తెచ్చాం. ఏఐ వినియోగంతో పాలనా పరమైన సమస్యలను అధిగమించడానికి త్వరలో రాష్ట్రంలో ఏఐ వర్సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. ఇది అంతర్జాతీయస్థాయి నిపుణులను తయారుచేస్తుందని లోకేష్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## గత ఐదేళ్లూ ఏపీకి చీకటి యుగం

గత ఐదేళ్లూ ఏపీకి చీకటి యుగం. చంద్రబాబు తన రాజకీయ జీవితంలో ఎన్నో క్లిష్టపరిస్థితులను చవిచూశారు. చంద్రబాబు రాజకీయ జీవితం గురించి చెప్పాలంటే ఒక చాప్టర్ సరిపోదు. గత ఐదేళ్లలో ఇదివరకెన్నడూ లేనివిధంగా ఆయన చీకటి జీవితాన్ని అనుభవించారు. చేయని తప్పునకు రాజమండ్రి సెంట్రల్ జైలులో 53 రోజులు జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. 2014-19 నడుమ ఆయన అభివృద్ధి చేసిన రాజమండ్రి సెంట్రల్ జైలులోనే బాబుగారిని బంధించారు. ఆనాటి పరిస్థితులు ప్రత్యక్షంగా చూసిన నా భార్య బ్రాహ్మణి ఇటువంటి రాజకీయాలు మనకు అవసరమా? అని ప్రశ్నించింది. అయితే ఆ సమయంలో హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రాటిట్యూడ్ కార్యక్రమానికి 45వేలమందికి పైగా హాజరుకావడంతో ఆమె తమ అభిప్రాయాన్ని మార్చుకున్నారు. బ్రాహ్మణి సహకారం వల్లే నేను రాజకీయాల్లో ముందుకు సాగుతున్నా. 226 రోజుల యువగళం పాదయాత్రలో ఆమె పూర్తి సహాయ, సహకారాలు అందించారు. నేను నా కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకునే సరికి ప్రతిరోజూ రాత్రి 11గంటలు అవుతుంది. రాజకీయాల్లో రాణించాలంటే వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేయక తప్పదు. రాజకీయాల్లో తాత ఎన్టీఆర్ లెగసీని కొనసాగించడం నాకు గర్వంగా ఉంది.

## ఎత్తుపల్లాలకు చూశాను

రాజకీయాల్లో ఎత్తుపల్లాలు చూశాను. రాజకీయాల్లో భవిష్యత్తు కోసం ఎవరైనా సేఫ్ సీటు ఎంచుకుంటారు. నేను మాత్రం 1985 తర్వాత ఎన్నడూ గెలవని మంగళగిరి నియోజకవర్గాన్ని ఎంచుకున్నాను. 2014లో పోటీచేసి 5300 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యాను. అయినప్పటికీ నిత్యం ప్రజల్లోనే ఉంటూ సేవలందించా. ఫలితంగా ఇటీవల ఎన్నికల్లో 91వేల పైచిలుకు మెజారిటీతో ప్రజలు గెలిపించారు. గెలు పోటములతో సంబంధం లేకుండా నిత్యం జనంలో ఉండే నేతలనే ప్రజలు ఆదరిస్తారు. జాతీయస్థాయి రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తారా? అన్న ప్రశ్నకు లోకేష్ సమాధానమిస్తూ... నా రాజకీయ భవిష్యత్తును ప్రజలే నిర్ణయిస్తారు. శాఖలు నిర్ణయించే సమయంలో లక్షలాది భావిభారత పౌరుల భవిష్యత్తుతో ముడిపడివున్న విద్యాశాఖను ఎంపిక చేసుకున్నా. సవాల్‌గా తీసుకుని విద్యావ్యవస్థలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాను. ప్రస్తుత రాజకీయాలు సంక్లిష్టంగా మారాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాతే రాజకీయాల్లోకి రావాలని సలహా ఇస్తున్నా. తెలుగుదేశంపార్టీ రాజకీయ విశ్వ విద్యాలయం లాంటిది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కీలకస్థానాల్లో ఉన్న నేతల మూలాలు టీడీపీతోనే ముడిపడి ఉన్నాయి.

## అభివృద్ధి వికేంద్రీకరణకు కట్టుబడి పనిచేస్తాం

అభివృద్ధి వికేంద్రీకరణకు కట్టుబడి పనిచేస్తున్నాం. విశాఖపట్నాన్ని ఐటి హబ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించాం. త్వరలో అక్కడ టిసిఎస్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. పారిశ్రామీకరణ నేపథ్యంలో వ్యవసాయరంగం దెబ్బతినకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. వ్యవసాయ పెట్టుబడులు, ఉత్పాదకతకు మధ్య పొంతన లేకపోవడంతో గిట్టుబాటు సమస్య ఏర్పడుతోంది. రాయలసీమలో బంగారం పండే భూములున్నాయి. నేను పాదయాత్ర నిర్వహించే సమయంలో మామిడి, అరటి, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటలు పండించే రైతులు నన్ను కలిసి పలు సమస్యలను తెలియజేశారు. అంతర్జాతీయంగా గిరాకీ ఉన్న రకాలను సాగుచేయాల్సిందిగా నేను వారికి సూచించాను. ఒక్కొకసారి కిలో 10పైసలకు కూడా టమోటా రైతులు తమ పంటను తెగనమ్ముకోవడం చూసి బాధ కలిగింది. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహించడం, మార్కెట్ ఇంటర్వెన్షన్‌తో రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు మేం కృషిచేస్తున్నాం. 2017లో ఐటీ సర్వ్ సదస్సుకు వచ్చాను. మళ్లీ ఇదే సదస్సుకు హాజరై మిత్రులను కలవడం ఆనందంగా ఉందని మంత్రి లోకేష్ అన్నారు.



# ఏపీకొక డాటా సెంటర్



- అమెజాన్ క్లౌడ్ సర్వీసెస్ అవసరం
- సులభతర పౌరసేవలకు సహకరించండి
- ఏడబ్ల్యుఎస్ ఎండి రేచల్ స్కాఫ్‌తో లోకేష్
- ఐటీ సర్వ్ సినర్జీ సమ్మిట్‌లో ఐటీ మంత్రి అప్పీల్

లాస్ వెగాస్ (యుఎస్ఎ): అమెరికాలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పెట్టుబడుల చైత్రయాత్ర కొనసాగుతోంది. లాస్ వెగాస్‌లో ఐటి సర్వ్ సినర్జీ సదస్సుకు హాజరైన మంత్రి లోకేష్ అక్కడి ప్రాంగణంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ మేనేజింగ్ డైరక్టర్ రేచల్ స్కాఫ్‌ను కలిసి ఏపీలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రేచల్ స్కాఫ్ మాట్లాడుతూ... క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్,ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్,డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌పై అమెజాన్ దృష్టి సారించినట్లు వివరించారు. ప్రపంచ మార్కెట్‌లో క్లౌడ్ సేవలు, పరిష్కారాలను విస్తరించడంలో ఏడబ్ల్యుఎస్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఏఐ అండ్ ఎంఎల్, క్లౌడ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఆవిష్కరణలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు.రేచల్ స్కాఫ్ డిస్కషన్స్‌కు ఐటీ మంత్రి లోకేష్ స్పందిస్తూ.. ఏపీలో స్మార్ట్ గవర్నెన్స్‌కు క్లౌడ్ సర్వీసెస్ అందించాలని కోరారు. క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ఆంధ్రప్రదేశ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ లక్ష్యాల సాధనకు ఏడబ్ల్యుఎస్ నాయకత్వం ఉపకరిస్తుందన్నారు.

స్మార్ట్ గవర్నెన్స్ కోసం ఏపీ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికల అమలులో ఏడబ్ల్యుఎస్ క్లౌడ్‌సేవలు కీలకపాత్ర వహించే అవకాశాలున్నాయని వివరించారు. ఏఐ, మిషన్ లెర్నింగ్‌లో అమెజాన్ చూపిస్తున్న శ్రద్ధ, నిబద్ధతలు ఏపీని ఏఐ ఇన్నొవేషన్ కేంద్రంగా మార్చాలన్న ప్రభుత్వ ఆశయానికి ఊతమిస్తాయని అన్నారు. పునరుత్పాదక శక్తితో నడిచే క్లౌడ్ డేటా సెంటర్‌ల స్థిరత్వానికి ఏడబ్ల్యుఎస్ కట్టుబడి ఉండటం, 2030నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 72గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సాధించాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఉందని అన్నారు. స్థిరమైన క్లౌడ్ కార్యకలాపాలకు పునరుత్పాదక ఇంధనాన్ని అందించేందుకు రాష్ట్రంలో బలమైన మౌలిక సదుపాయాలు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు భరోసానిస్తాయని అంటూ.. ఏడబ్ల్యుఎస్ తదుపరి డేటాసెంటర్‌కు ఆంధ్ర ప్రదేశ్ అనువైన ప్రదేశంగా ప్రతిపాదించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లోని స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుల్లో మౌలిక సదుపాయాలు, పట్టణ ప్రణాళిక, పౌరసేవలకు ఏడబ్ల్యుఎస్ సహకారం అవసరమని, ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్ సర్వీ సెస్ డెలివరీ సిస్టమ్, డిజిటల్ గవర్నెన్స్ మెరుగుదల, ఈ-గవర్నెన్స్ కార్యక్రమాలకు అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారం కోరుతున్నామని మంత్రి లోకేష్ అన్నారు. దీనిపై రేచల్ స్పందిస్తూ ఏపీలో క్లౌడ్ సేవలు అందించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

### రెవేచర్ సిఇఓ అశ్విన్ భరత్‌తో మంత్రి లోకేష్ భేటీ

ఐటి సర్వ్ సినర్జీ సమ్మిట్ ప్రాంగణంలో రెవేచర్ సిఇఓ. అశ్విన్ భరత్‌తో మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో టెక్ టాలెంట్ డెవలప్‌మెంట్ సెంటర్ నెలకొల్పడానికి రెవేచర్ భాగస్వామ్యం వహించాలని కోరారు. రాష్ట్రంలో నైపుణ్య కార్యక్రమాలకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఇతర డిమాండ్ వున్న ఐటి నైపుణ్యాలలో యువతకు శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. ప్రత్యేక కోడింగ్ బూట్ క్యాంప్‌లను అందించడానికి ఆంధ్రప్రదేశ్‌లోని వర్శిటీలు, సాంకేతిక సంస్థలతో కలసి పనిచేయాలన్నారు. ఏపీలో స్టార్టప్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతోందని, స్థానిక స్టార్టప్‌లు, చిన్న- మధ్యతరహా సంస్థలకు టెక్ టాలెంట్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ నైపుణ్యాన్ని అందించడంలో మీవంతు సహకారం అందించాలని కోరారు. ఈ-గవర్నెన్స్, స్మార్ట్ సిటీ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్‌లలో పని చేయడానికి శిక్షణ పొందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను అందించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని లోకేష్ కోరారు.

## డ్రోన్ సమ్మిట్ అద్భుతం...

**అధికారులకు సీఎం చంద్రబాబు అభినందన**

అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అమ రావతి డ్రోన్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించిన అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. బుధవారం సచివాలయంలో రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన శాఖ కార్యదర్శి, ఎస్.సురేష్‌కుమార్, ఏపీ డ్రోన్స్ కార్పొ రేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.దినేష్‌కుమార్‌లు ముఖ్యమంత్రిని కలిసి డ్రోన్ జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ కృష్ణానది తీరాన 5,500లకు పైగా డ్రోన్లతో నిర్వహించిన ప్రదర్శన అద్భుతంగా ఉందని ప్రశంసిం చారు. డ్రోన్ సమ్మిట్ నిర్వహణలో ఎక్కడా ఎలాంటి అంతరాయాలు లేకుండా అధికా రులు సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇదే స్ఫూర్తిని ఇకముందు కూడా ఇలాగే కొనసాగించాలి.. బాగా చేశారు అంటూ అభినందించారు.



## టెక్ స్టార్టప్‌లకు ఏఐ టూల్స్, మెంటార్‌షిప్ అందించండి



- ఏఐ ఆధారిత పరిశ్రమలకు యువతకు శిక్షణ ఇవ్వండి
- సేల్స్‌ఫోర్స్ సీఈవో క్లారా షిహ్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ

లాస్ వెగాస్ (యుఎస్ఎ): అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ అక్కడ వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుసగా భేటీ అవుతున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానిస్తున్నారు. తాజాగా లాస్ వెగాస్‌లోని సినర్జీ సమ్మిట్ ప్రాంగణంలో సేల్స్‌ఫోర్స్ ఏఐ సీఈవో క్లారా షిహ్‌తో భేటీ అయ్యారు.రాష్ట్రంలో స్మార్ట్ గవర్నెన్స్, ఏఐ డ్రివెన్ ఎకానమీపై మేం దృష్టిసారించాం.. ఏఐ స్కిల్లింగ్ కార్యక్రమాలు ప్రారంభించేందుకు సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో ఏఐ ఆధారిత పరిశ్రమల కోసం యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి శ్రామిక శక్తిని సిద్ధం చేయాలి.. సేల్స్‌ఫోర్స్ ఏఐ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు, ప్రయోగాత్మక శిక్షణను అందించడానికి విద్యాసంస్థలతో భాగస్వాములు కావాలి.. ఏపీ టెక్ స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధి చేసేందుకు స్థానిక స్టార్టప్‌లకు ఏఐ టూల్స్, మెంటార్‌షిప్‌ను అందించాలని కోరారు. టెక్ స్టార్టప్‌లలో నవీన ఆవిష్కరణల కోసం మీ వ్యవస్థాపక స్ఫూర్తి ఆంధ్రప్రదేశ్ ఆశయాలకు అనుగుణంగా ఉందని తెలిపారు.

### ఐన్‌స్టీన్ ఏఐని రాష్ట్రంలో పరిచయం చేయండి

ప్రభుత్వ సేవల్లో కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం)ను మెరుగుపరచ డానికి సేల్స్‌ఫోర్స్ యొక్క ఐన్‌స్టీన్ ఏఐని రాష్ట్రంలో పరిచయం చేయండి. ఏఐ - పవర్డ్ ఆటోమేషన్, అనలిటిక్స్ ద్వారా పాలనారంగంలో సామర్థ్యాన్ని మెరుగు పర్చేం దుకు సహకారం అందించండి. ఈ-గవర్నెన్స్, ఏఐ-డ్రివెన్ సొల్యూషన్స్‌ను అమలు చేయడం, సర్వీస్ డెలివరీ మెకానిజంను మెరుగుపరచడం, ప్రిడిక్టివ్ అనలి టిక్స్, ఆటోమేటెడ్ ప్రాసెస్‌ల ద్వారా పబ్లిక్ ఎంగేజ్‌మెంట్‌ను అమలు చేయడానికి సేల్స్‌ఫోర్స్ సహకారం కోరుతున్నాం. పరిపాలనలో ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మే షన్ కోసం ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయండి. ఏపీలో అమలయ్యే స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుల్లో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ సేఫ్టీ, అర్బన్ ప్లానింగ్ వంటి రంగాల్లో భాగస్వామ్యం వహించే అవకాశాలను పరిశీలించాల్సిందిగా కోరారు.

### నైతికతతో కూడిన ఏఐపై దృష్టి సారించాం

ఈ సందర్భంగా క్లారా షిహ్ మాట్లా డుతూ సేల్స్‌ఫోర్స్ ఏఐ వ్యూహ పర్య వేక్షణ, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్‌లో ఆఫర్లను మెరుగు పర్చడం, ఏఐ అండ్ మిషన్ లెర్నింగ్‌లో నవీన ఆవిష్కరణలపై మేం దృష్టి సారించాం. ఐన్‌స్టీన్ ఏఐ ప్లాట్‌ఫారమ్ అభివృద్ధికి కసరత్తు చేస్తున్నాం. కస్టమర్ మనోభీష్టానికి అనుగుణంగా ప్రిడిక్టివ్ అనలిటిక్స్, వ్యాపార విధుల్లో ఆటోమేషన్ కోసం ఏఐ టూల్స్ రూపొందించడం వంటి సేవలు అందిస్తున్నాం. సేల్స్‌ఫోర్స్ ఏఐ సంస్థ నైతికతతో కూడిన కృత్రిమ మేధపై దృష్టి సారిస్తుంది. ప్రభుత్వ రంగ ప్రాజెక్టులలో బాధ్యతాయుతమైన ఏఐ వినియోగానికి మేం కట్టుబడి ఉన్నాం. ఏఐ అండ్ ఎంఎల్ నవీన ఆవిష్కరణల్లో దూసుకుపోతున్న తమ సంస్థ ప్రస్తుతం 287 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిట లైజేషన్ కలిగి ఉందని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ సహచర బృందంతో మాట్లాడతానని పేర్కొన్నారు.

## ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

**ఎంపీ కేశినేని శివనాథ్**

విజయవాడ(చైతన్యరథం): దీపావళి పండుగ సందర్భంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగునేలపై నరకాసురుని ఏలుబడిలో ఇక్కట్ల పాలైన సమస్త ప్రజలు చీకటి పాలనకు స్వస్తి పలి కారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో వెన్నెల వెలుగు తెలుగు లోగిళ్లలో ప్రసరి స్తుంది. రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనిస్తోంది. ఈ శుభ సమయంలో విచ్చేసిన తొలి దివ్య దీపావళికి సుస్వాగతం. వెలుగుల పండుగ దీపావళి ప్రజల జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలని ఆకాంక్షించారు. ప్రతిఒక్కరూ పండుగను ఆనందోత్సాహాల మధ్య సురక్షితంగా జరుపుకోవాలని కోరారు.

## కేశినేని చొరవతో సీఎంఆర్ఎఫ్ మంజూరు

విజయవాడ(చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గం 45వ డివిజన్ సితార సెంటర్ రామరాజునగర్‌కు చెందిన చుక్కా నాగరాజు తన బైపాస్ సర్జరీకోసం తక్షణ ఆర్థికసాయం కోరుతూ సీఎంఆర్ఎఫ్ కింద లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)కి ఎంపీ కేశినేని శివనాథ్ సిఫార్సుతో అర్జీ పెట్టుకున్నారు. దాంతో ఆయనకు రూ.2.50 లక్షలు మంజూరు కాగా బుధవారం చుక్కా నాగరాజు కుమారుడు చుక్కా రాజ్‌కుమార్‌కు ఎంపీ కార్యాలయ సిబ్బంది ఆ పత్రాలను అందజేశారు.బాధిత కుటుంబసభ్యులు ఎంపీ కేశినేనికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ వెంకటరత్నం, లైజనింగ్ ఆఫీసర్ వి.మోహనరావు, బాలినేని మోహనరావు పాల్గొన్నారు.

చైతన్యరథం

# దీపం పథకంతో పండుగ కాంతివంతం

**శుభాకాంక్షలను ట్వీట్ చేసిన సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్య రథం): 'తెలుగు ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు. నరకాసుర వధ తర్వాత ఇంటింటా దీపాలు వెలిగించుకుని సంతోషంగా జరుపుకునే వెలుగుల పండుగ ఇది. ఒక దీపాన్ని



వెలిగించడం ద్వారా మన చుట్టూ వున్న చీకట్లను పారద్రోలినట్లుగా ఎన్నికలముందు ఇచ్చిన సూపర్ 6హామీల్లో భాగంగా 'దీపం 2.0' పథకంతో ఈ దీపావళి పండుగను మరింత కాంతివంతం చేస్తున్నాము. తెలుగింటి ఆడబిడ్డల కళ్లలో ఆనందం చూసేందుకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలెండర్లను ఉచితంగా ఇవ్వడ మే ఈ పథకం ముఖ్యోద్దేశ్యం. అర్హులైన ఆడబిడ్డలు ఇప్పటికే 'దీపం 2.0' పథకానికి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇది సంతోషం కలిగించే విషయం. మీనుంచి వస్తున్న స్పందనతో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసే స్ఫూర్తిని పొందుతు న్నాము. ఈ ఆనంద దీపావళి పండుగ రాష్ట్రప్రజల జీవితంలో కొత్త వెలుగు నింపాలని ఆకాంక్షిస్తున్నాను' - అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికపై పోస్టు చేశారు.

# సకల జనులకు శుభాలు కలగాలి

**డిప్యూటీ సీఎం పవన్ దీపావళి శుభాకాంక్షలు**

అమరావతి (చైతన్య రథం): దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజకు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. 'జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి దీపావళి. దీపాన్ని పరబ్రహ్మ స్వరూపంగా, మనో వికాసానికి, ఆనందానికి నవ్వులకు,



సజ్జనత్వానికి, సద్గుణసంపత్తికి ప్రతీకగా భావిస్తాం. అటువంటి దీపావళి పండుగ సందర్భంగా సకల జనులకు శు భాకాంక్షలు. దీపావళికి దీప శోభతోపాటు బాణాసంచా ప్రత్యేకత గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన పని లేదు. జాగ్రత్తలు పాటిస్తే దీపావళి నిజంగా నయనానందకరంగా, హృద్యంగా మనస్సులో గుర్తుండి పోతుంది. ఏమాత్రం అజాగ్రత్తతోనో... నిర్లక్ష్యంతోనే టపాకాయలు కాలిస్తే అది కాళరాత్రిగా వెంటాడుతుంది. ఏటా దీపావళి ముగిసిన తరువాత పలువురు బాణసంచా గాయాలతో ఆసుపత్రుల పాలవడం మనం చూస్తూనే ఉంటాం. అందువల్ల పెద్దలు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని మనవి చేస్తున్నాను. అనాదిగా మనం జరుపుకొంటున్న ఈ దీపావళి పండుగ సకల జనులకు శుభాలను అందచేసి ఆనందకరమైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను" అని పవన్ ఓ ప్రకటనలో తెలిపారు.

# ఏటా 15శాతం వృద్ధి రేటు



- 2047నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఏపీ
- విజన్ డాక్యుమెంట్‌పై నీతి ఆయోగ్ భేటీలో సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్యరథం): విజన్ డాక్యుమెంట్ 2047కు సంబంధించిన అంశాలపై సీఎం చంద్రబాబుతో నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం చర్చించారు. అమరావతిలోని సచివాలయంలో జరిగిన భేటీకి నీతి ఆయోగ్‌కు సంబంధించిన సలహాదారు, డైరెక్టర్లతోపాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమావేశంలో ప్రధానం గా చర్చించారు. ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047 ప్రణాళిక రూపొందించినట్లు సీఎం చంద్ర బాబు వివరించారు. 2047నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఏపీ అభివృద్ధే లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్‌ను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో రూపొందించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు.

వ్యవసాయం, ఆక్వా తదితరరంగాల్లో అభివృద్ధి సాధించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు సీఎం నీతిఆయోగ్ సీఈఓకు వివరించారు. పేదరిక నిర్మూలన, ఈజ్ ఆఫ్ లివింగ్, సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, డెమోగ్రాఫిక్ మేనేజిమెంట్, డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ వంటి గ్రోత్ ఇంజిన్లతో వృద్ధిరేటు సాధిం చేలా ఈ ప్రణాళికలు రూపొందాయని, వీటిని సమర్థంగా అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేసినట్టు సీఎం చంద్రబాబు తెలిపారు.

# టెక్నాలజీ, తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టండి

- బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ రూపకల్పనకు మద్దతు ఇవ్వండి
- పెప్సికో మాజీ సీఈవోతో భేటీలో మంత్రి నారా లోకేష్

లాస్ వెగాస్(యుఎస్ఏ): పెప్సికో మాజీ చైర్మన్, మాజీ సీఈవో ఇంద్రా నూయితో రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ లాస్ వెగాస్‌లో ఐటీ సర్వ్ సినర్జీ సమ్మిట్ ప్రాంగణంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ విజనరీలీడర్ చంద్రబాబు నేతృత్వంలో ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు అమలుచేస్తూ వేగవంతమైన అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగు తోంది..టెక్నాలజీ,తయారీరంగంలో విదేశీ పెట్టు బడులను ఆకర్షించడానికి ఏపీ ప్రభుత్వం చేపడు తున్న నిర్మాణాత్మక కృషిలో భాగస్వాములుకండి.. స్థిరమైన ఆర్థిక వృద్ధిని సాధించేందుకు మేం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతునివ్వాలని కోరారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు,హరిత కార్య క్రమాలు, పర్యావరణ హిత పారిశ్రామిక విధా నాలు అమలుచేస్తున్న ఆంధ్రప్రదేశ్ నిబద్ధతను పారిశ్రామిక సమాజానికిచాటిచెప్పాలని కోరారు.

**మహిళా ప్రాతినిధ్యం పెంపుపై సలహాలివ్వండి**

మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో మేం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. నాయకత్వం, సాంకే తికతలో లింగ ప్రాతినిధ్యాన్ని పెంచేలక్ష్యంతో రాష్ట్రం తరపున కార్యక్రమా లను రూపొందించండి. లింగ వైవిధ్యం సంస్థాగత విజయాన్ని ఎలా మెరుగు పరుస్తుందో చర్చించండి. వివిధ రంగాలలో మహిళ లకు సాధికారత కల్పించ డంపై మీ ఆలోచనలను మాతో పంచుకోండి. ప్రజా రోగ్యానికి సంబంధించి ప్రత్యేకించి వెల్‌నెస్ కార్య క్రమాలు, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించా ల్సిన అవసరం ఉంది. ఇందులో కార్పొరేట్, ప్రభుత్వ రంగాల భాగస్వామ్యం ద్వారా ఆరోగ్యవంతమైన సమా జాన్ని నిర్మించేందుకు సరికొత్త మార్గాలను అన్వేషించాలని విజ్ఞప్తిచేశారు.



**బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ రూపకల్పనలో మద్దతునివ్వండి**

విద్య, సాంకేతిక ఆధారిత నైపుణ్యాల అభివృద్ధి ద్వారా యువతకు సాధికారత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. యువ నిపుణులు వారి కెరీర్‌లో విజయం సాధించడానికి అవసరమైన మెంటారింగ్ ప్రోగ్రామ్‌లను రూపొందిం చండి. రాష్ట్ర సాంకేతిక పర్యావరణ వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, పరిశ్రమల స్థాపనకు గల అవకాశాలను ప్రత్యక్షంగా చూడడానికి రాష్ట్రాన్ని సందర్శించాలని కోరారు. ఏపీలో పెట్టుబడుల ను ప్రోత్సహించడం, బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ రూప కల్పనలో మీ మద్దతు కోసం ఎదురు చూస్తున్నా మని వివరించారు. లోకేష్ ప్రతిపాదనలపై ఇంద్రా నూయి సానుకూలంగా స్పందిస్తూ ఏపీలో పెట్టు బడులకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.



## ముఖ్యమంత్రితో రామ్‌దేవ్ భేటీ

అమరావతిలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబును స్వామి రామ్‌దేవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ మరియు విద్యారంగాలలో పెట్టుబడులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వెల్‌నెస్ సెంటర్‌ల అవకాశాలపైనా ఇరువర్గాల మధ్య చర్చలు జరిగాయి. అదే విషయాన్ని సీఎం చంద్రబాబు తన ఎక్స్ వేదికపై పోస్టు చేశారు.



# అన్న క్యాంటీన్లకు రూ.కోటి విరాళం



- సీఎంను కలిసి అందచేసిన సజ్జా రోహిత్
- భారీగా వరద బాధితులకూ విరాళాలు

అమరావతి (చైతన్య రథం): పేదల కడుపు నింపుతున్న అన్న క్యాంటీన్లకు సజ్జా రోహిత్ అనే దాత రూ. కోటి విరాళం అందజేశారు. సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి విరాళానికి సంబంధించి చెక్కును అందజేశారు. అలాగే కపిలేశ్వరపురం మాతృభూమి శ్రేయోసంఘం ప్రతినిధి కె. రామ్మోహనరావు అన్న క్యాంటీన్లకు రూ.5,41,116 చెక్కును అందజేశారు. ఎస్.కె. యూనివర్సిటీ సిబ్బంది తరపున ఆచార్య జి.వెంకటనాయుడు రూ.17,34,786, కుప్పం నియోజకవర్గం నుండి సేకరించిన రూ.14,36,000 విరాళాన్ని మాజీ ఎమ్మెల్సీ గౌరివాని శ్రీనివాసులు వరదబాధితుల సహాయర్థం ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు.







## తితిదే చైర్మన్‌గా బీఆర్ నాయుడు

### 24 మందితో పాలక మండలి ఏర్పాటు



తిరుమల (చైతన్య రథం): తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పాలక మండలి కొత్త చైర్మన్‌గా బీఆర్ నాయుడు నియమితులయ్యారు. 24 మంది సభ్యులతో తితిదే పాలకమండలి ఏర్పాటు కానుంది. ఈ మేరకు తితిదే అధికారిక ప్రకటన విడుదల చేసింది.

తితిదే బోర్డు సభ్యులు: జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట ఎమ్మెల్యే), వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి (కోవూరు ఎమ్మెల్యే), ఎంఎస్ రాజు (మడకశిర ఎమ్మెల్యే),పనబాక లక్ష్మి (కేంద్ర మాజీ మంత్రి), నర్సిరెడ్డి, సాంబశివరావు (జాస్తి శివ), శ్రీసదాశివరావు నన్నపనేని, కృష్ణమూర్తి, కోటేశ్వరరావు, మల్లెల రాజశేఖర్ గౌడ్, జంగా కృష్ణమూర్తి, దర్శన్. ఆర్.ఎన్, జస్టిస్ హెచ్ఎల్ దత్, శాంతారామ్, పి.రామ్మూర్తి, జానకీ దేవి తమ్మిశెట్టి, బూంగునూరు మహేందర్ రెడ్డి, అనుగోలు రంగశ్రీ, బూరగాపు ఆనంద సాయి, సుచిత్ర ఎల్ల, నరేశ్‌కుమార్, డా అదిత్ దేశాయ్, శ్రీసౌరబ్ హెచ్ బోరా. ఇదిలావుంటే, టీటీడీ బోర్డులో ముగ్గురు ఎమ్మెల్యేలకు, తెలంగాణకు చెందిన ఐదు గురికి, కర్ణాటకకు చెందిన ముగ్గురికి, తమిళనాడుకు చెందిన ఇద్దరికి, గుజరాత్, మహారాష్ట్ర నుంచి ఒక్కొక్కరికి చోటు లభించింది.

ఇదిలావుంటే, మీడియా రంగంలో తెలుగు రాష్ట్రాలకు సుపరిచితులైన బిఆర్ నాయుడు స్వయంకృషి, పట్టుదల, ఆధ్యాత్మిక నిబద్ధతకూ ప్రతీక. వ్యాపార వేత్తగా, సామాజిక కార్యకర్తగా, రాజకీయ స్పృహకలిగిన వ్యక్తిగా బీఆర్ నాయుడు సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు., టీటీడీ బోర్డు చైర్మన్‌గా అవకాశాన్నిచ్చి అభినందనలు తెలిపారు. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం దిగువ పూనేపల్లి గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన బిఆర్ నాయుడు పట్టుదల స్వయంకృషితో ఎదిగారు. సాంకేతిక విద్యను అభ్యసించి హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌లో ఉద్యోగం నిర్వహించారు. బిహెచ్ఇఎల్ సంస్థలో లిటరరీ సెక్రటరీగా, సాంస్కృతిక కార్యదర్శిగా చురుకైన పాత్ర పోషించారు.

ఉద్యోగుల తరపున సాహిత్య సాంస్కృతిక అంశాలపై ప్రత్యేక పక్ష పత్రికనూ నడిపారు. బిహెచ్ఇఎల్‌లో పనిచేస్తున్న సమయంలోనే ఎన్టీ రామారావు రాజకీయ రంగ ప్రవేశం చేయడంతో.. పార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ వచ్చారు. స్వతహాగా వెంకటేశ్వరస్వామి భక్తుడైన బీఆర్ నాయుడు ముందునుంచీ ఆధ్యాత్మిక కార్యక్రమాలపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పెంపొందించే విధంగా హిందు ధర్మ ప్రచార నిమిత్తం "హిందూ ధర్మం" పేరుతో 2018లో ఆధ్యాత్మిక ఛానల్ స్థాపించారు. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని పుణ్యక్షేత్రాల నుంచి జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలు, వివిధ క్షేత్రాల మహత్యాలు ప్రత్యేకంగా ప్రసారం చేస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలను హిందూధర్మం ద్వారా యావత్ తెలుగు ప్రజలకు చేరువచేసే ప్రయత్నం బీఆర్ నాయుడు చేస్తున్నారు.

దేవస్థాన ధార్మిక కార్యకలాపాలు, ఆగమ శాస్త్రాల ప్రాధాన్యత, హిందూ ధర్మ పరిరక్షణ, భక్తుల మనోభావాలు స్థానికుల అవసరాలు అన్నీ తెలిసిన వ్యక్తిగా టిటిడి బోర్డు చైర్మన్‌గా పూర్తి చిత్తశుద్ధితో బాధ్యత నిర్వహిస్తానని బిఆర్ నాయుడు అన్నారు. తన పదవీకాలంలో పూర్తి పారదర్శకత, ధార్మిక చిత్తశుద్ధితో వెంకటేశ్వర స్వామి సేవ చేసేందుకు కంకణబద్ధుడై ఉన్నట్టు బిఆర్ నాయుడు ప్రకటించారు.

# పోలవరంపై రాజీ లేదు

- 45.72 మీటర్ల ఎత్తులోనే ప్రాజెక్ట్ నిర్మాణం
- 150 అడుగులమేర నీటిని నిల్వ చేస్తాం
- నదులను అనుసంధానంతోనే అది సాధ్యం
- రెండు ఫేజుల డ్రామా వైసీపీ నిర్వాకమే..
- ప్రాజెక్ట్ ఎత్తును 41.15 మీటర్లకు కుదించారు
- మీడియాతో జలవనరుల మంత్రి రామానాయుడు




అమరావతి (చైతన్య రథం): పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో తమ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడే ప్రసక్తే లేదని, గతంలో తాము ప్రతిపాదించినట్లుగా 150 అడుగుల మేర నీటి నిల్వ ఉండేలా 45.72 మీటర్ల ఎత్తులోనే ప్రాజెక్టును నిర్మించడం జరుగుతుందని రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. రెండు ఫేజులంటూ పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు కుదించిన ఘనత గత ప్రభుత్వానిదేనని తప్పుపట్టారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును రెండు ఫేజుల్లో నిర్మిస్తామంటూ, ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు తగ్గించి పోలవరం ప్రాజెక్టు అథారిటీకి పలుమార్లు ప్రతిపాదనలు పంపిన గత ప్రభుత్వం, ఆ బురదను తమ ప్రభుత్వంపై రుద్దేలా దుష్ప్రచారం చేయడం విడ్డూరమన్నారు. 2022 జనవరిలో పోలవరం ప్రాజెక్టు ఫేజ్-1 మరియు 2 అంటూ 41.15 మీటర్ల ఎత్తున ప్రతిపాదిస్తూ అప్పటి స్పెషల్ సిఎస్ పోలవరం ప్రాజెక్టు అథారిటీ సిఇఓకు లేఖ వ్రాస్తూ రూ.10,911.15 కోట్ల మేర నిధులు రావాలని అడిగారన్నారు. తదుపరి జలవనరుల శాఖ ప్రిన్సిఫల్ సెక్రటరీ, సిఇ తదితరులు కూడా పలుమార్లు లేఖలు వ్రాయడం జరిగిందన్నారు. వాటిలో పోలవరం ప్రాజెక్టు ఎత్తు 41.15 మీటర్లు అంటూ ప్రత్యేకంగా మెన్షన్ చేయడం జరిగిందన్నారు.

2014-19 మధ్యకాలంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ పోలవరం ప్రాజెక్టును ఫేజ్-1, 2 అని ఎప్పుడూ విభజించలేదని, సుప్రీమ్ కోర్టు, గోదావరి ట్రిబ్యునల్ అనుమతించిన మేరకు 150 అడుగులమేర నీటిని నిల్వ చేసేలా 45.72 మీటర్ల ఎత్తున ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.55,545 కోట్లకు టెక్నికల్ ఎడ్వైజరీ కమిటీ ఆమోదాన్ని పొందడం జరిగిందన్నారు. తమ కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో ఏమాత్రం రాజీ పడబోదని, నూటికి నూరుశాతం 45.72 మీటర్ల ఎత్తున ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అయితే గత ప్రభుత్వం ఫేజ్-1, 2లో పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు ప్రతిపాదించిన విధంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ క్రింద నిధులు విడుదలవుతాయన్నారు. కానీ ఫేజ్-1, 2లో మాత్రం 45.72 మీటర్ల మేర ప్రాజెక్టు ఎత్తుకు అనుగుణంగా రూ.30 వేల కోట్లు అర్ అండ్ అర్ ప్యాకేజీ నిధులు అవసరమవుతాయని తాము ప్రతిపాదించామన్నారు.

పోలవరం ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలవల్లే 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని హైద్రాబాద్ ఐఐటీ నిపుణుల బృందం కూడా నిర్ధారించినట్లు చెప్పారు. 2014-19 మధ్య కాలంలో తమ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికై రూ.11,762 కోట్లు ఖర్చు చేస్తే, కేవలం రూ.6,764 కోట్లు మాత్రమే కేంద్రం నుండి రీయింబర్స్‌మెంట్ రూపేణా వచ్చాయన్నారు. అయితే గత ప్రభుత్వం కేవలం రూ.4,167 కోట్లను మాత్రమే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వెచ్చించిందని, అయితే కేంద్రం నుంచి రూ.8,382 కోట్లు రీయింబర్స్‌మెంట్ రూపేణా నిధులు వస్తే అందులో రూ.3,385 కోట్లను గత ప్రభుత్వం డైవర్టు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఫేజ్-1, 2 ప్రతిపాదించిన విధంగా కేంద్రం నుండి రూ.12,250 కోట్ల నిధులు ఈ మధ్యనే అందాయని, అదే గత ప్రభుత్వ హయాంలో అందితే ఈ నిధులను కూడా డైవర్టు చేసి ఉండేవారని మంత్రి రామానాయుడు వ్యాఖ్యానించారు.

చైతన్యరథం

# వైసీపీ మోసం చేసింది..

- భూమి తీసుకుని.. పరిహారం చెల్లించలేదు
- అధికారులను అడిగితే.. మంత్రిని కలవమన్నారు
- వెళ్లలేదని.. పరిహారం చెల్లింపు ఆపేశారు
- గ్రీవెన్స్‌లో పల్నాడు జిల్లావాసి ఫిర్యాదు
- తగురీతిన సమస్య పరిష్కరిస్తామన్న మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి (చైతన్య రథం): పల్నాడు జిల్లాలోని నక్కవాగు కరకట్ట అభివృద్ధికి భూసేకరణ కింద తన భూమిని తీసుకుని.. వైసీపీ ప్రభుత్వం పరిహారం చెల్లించకుండా వేధించిందని పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం జగ్గాపురానికి చెందిన బసవేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. నక్కవాగు కరకట్ట అభివృద్ధి కోసం 2.39 ఎకరాల భూమి తీసుకున్నారని, నేటికీ పరిహారం అందించలేదన్నారు. పరిహారం కోసం అధికారులను కలిస్తే.. మంత్రి విడదల రజినీ వద్దకు పొమ్మని అధికార్లు చెప్పేవారని, అంగీకరించకపోవడంతో బిల్లులు అడ్డుకున్నారంటూ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు బసవేశ్వరరావు. తనకు రావాల్సిన పరిహారం ఇప్పించాలని వేడుకున్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అర్జీలను స్వీకరించారు.

ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో రికార్డు అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమను ఎటువంటి ఉత్తర్వులు లేకుండా 2023 అక్టోబరు 27న వైసీపీ ప్రభుత్వం విధుల నుంచి తొలగించిందని, దాంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని.. మానవతా కోణంతో తిరిగి తమను విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని అర్జీని సమర్పించారు.

గత ప్రభుత్వ రీ సర్వే కారణంగా అర్చకులు తీవ్రంగా నష్టపోయారని.. అర్చకులు అనుభవిస్తున్న భూములను ఆన్‌లైన్‌లో అడంగల్‌నందు పేర్లను తొలగించడంతో ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందడంలేదని.. తిరిగి అర్చకుల పేర్లమీద అండగల్ నమోదు చేసి కార్డులు ఇవ్వాలని అర్చక సంక్షేమ సంఘ సభ్యులు పలువురు మంత్రి రామానాయుడికి విజ్ఞప్తి చేస్తూ అర్జీ సమర్పించారు.

ఏలూరు జిల్లా పోలవరం మండలం కొత్త పట్టిసం గ్రామంలో 2023 మే 16న ట్రాన్స్‌ఫారమ్ నుంచి నిప్పు రవ్వలుపడి సుమారు 27 ఎకరాల్లోని 16 వరి కుప్పలు దగ్ధమయ్యాయని, తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని బాధితులు గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు.

ఏలూరు జిల్లాలో కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం సరిపల్లి గ్రామంమీదుగా రేకులకుంట వరకూవున్న 19 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రహదారి గోతులుపడి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఇబ్బందిలేకుండా చూడాలని మాజీ ఏఎమ్సీ చైర్మన్ పారేపల్లి రామారావు విజ్ఞప్తి చేశారు.

2017-2018లో నీరు-చెట్టు పథకంలో పనులు చేపట్టకుండానే.. చేసినట్లు చూపించి నిధులు రాబట్టేందుకు వైసీపీ నాయకుడు నాగసుబ్రహ్మణ్యం, అతని బినామీ సత్యవరప్రసద్‌లు యత్నిస్తున్నారని.. దీన్ని పరిశీలించి బిల్లుల మంజూరును అడ్డుకోవాలని రంపచోడవరం నియోజకవర్గం గొంటువానిపాలెం, కిమ్ముర్రు గ్రామానికి చెందిన పలువురు రైతులు ఫిర్యాదు చేశారు.

పోలవరం ముంపు గ్రామాల్లో భాగంగా తమ ఊరును ఖాళీ చేసి ఇళ్లను కోల్పోయామని.. ఇళ్లు విడిచిపెట్టి నాలుగేళ్లయినా నేటికీ పరిహారం అందలేదని.. వైసీపీ అనుచరులకు మాత్రం వెంటనే మంజూరు చేశారని... తాము ఆఫీసులచుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోలేదని తమకు రావాల్సిన పరిహారం ఇప్పించి ఆదుకోవాలని అల్లూరి జిల్లా దేవీపట్నం మండలానికి చెందిన నిర్వాసితులు అర్జీ సమర్పించారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి.. తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని మంత్రి రామానాయుడు, అశోక్‌బాబు, శ్రీనివాసులు బాధితులకు హామీ ఇచ్చారు.











# ఇక డ్వాక్రాలు బలోపేతం

- వచ్చే ఐదేళ్లల్లో పేదల ఆదాయం రెట్టింపునకు ప్రణాళికలు
- నిజమైన లబ్ధిదారుల ఎంపికకు ఎస్‌హెచ్‌జి ప్రొఫైలింగ్ యాప్
- జనవరి నుంచి అమరావతి రాజధాని పనులు
- రాష్ట్ర పురపాలక మంత్రి పి. నారాయణ వెల్లడి







అమరావతి (చైతన్య రథం): పేద ప్రజల సంక్షేమం కోసం సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు అమలు చేయాలంటే ప్రజల స్థితిగతులపై పూర్తి సమాచారం ప్రభుత్వం వద్ద ఉండాలని, అప్పుడే ఆశించిన ఫలితాలు సాధించగలమని రాష్ట్ర పురపాలక మంత్రి పి. నారాయణ తెలిపారు. మహాత్మాగాంధీ రోడ్డులోని అమరావతి కన్వెన్షన్ హాల్‌లో మెప్మా స్వయం సహాయక సంఘాల ప్రొఫైలింగ్ యాప్‌పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వర్క్‌షాపుకి మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ డ్వాక్రా, మెప్మా సంఘాల సభ్యులకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తారని... వారి ఆర్థిక పరిస్థితి బాగుంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా బాగుపడుతుందని బలంగా నమ్ముతారన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆదాయం రెట్టింపు కావాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. అందుకు అనుగుణంగా మెప్మాలో అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకుని అమలు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వం అందించే పథకాలు సక్రమంగా పేద ప్రజలకు చేరువ కావాలంటే డేటా ప్రొఫైలింగ్ ఎంతో అవసరమన్నారు. సభ్యుల డేటా ఆధారంగా ఎవరెవరికి ఎలాంటి పథకాలు, ప్రభుత్వం అందించాలనే దానిపై స్పష్టత వస్తుందన్నారు. గత ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను నిర్లక్ష్యం చేసిందన్నారు. పేదల కోసం తలపెట్టిన టిడ్కో ఇళ్లను కూడా లబ్ధిదారులకు అందించలేదన్నారు. ప్రొఫైల్ యాప్ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యుల డేటా నవంబర్‌కు పూర్తి అవుతుందని, డిసెంబర్ నెలాఖరు నాటికి డేటా బేస్ మొత్తం సిద్ధం అంతుందన్నారు. జనవరి నుంచి సభ్యుల డేటా ప్రకారం ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామన్నారు. అమెరికాలో అయితే పౌరులకు యూనిక్ నెంబర్ ఉంటుందని, దాని ప్రకారం వారి సమాచారం సేకరించవచ్చని, ఇండియాలో అయితే ఆధార్ నంబర్ ద్వారా సమాచారం వస్తుందన్నారు. ఏదైనా పాలసీ చేయాలన్నా, పథకాలు అందించాలన్నా ప్రభుత్వం వద్ద పౌరుల సామాజిక, ఆర్థిక స్థితి ఎలా ఉందనే సమాచారం ఉంటే ఎవరికి ఏ పథకాలు అందించాలో అనేదానిపై పూర్తి అవగాహన ఉంటుందన్నారు. మెప్మా ఏపీలో 2 లక్షల 78 వేల 407 స్వయం సహాయక సంఘాలున్నాయని అందులో మొత్తం సభ్యులు 28 లక్షల 56 వేల 651 మంది ఉన్నారన్నారు.

గత ఐదేళ్లలో స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన డేటా ప్రాసెస్ సరిగా జరగలేదన్నారు. దీనివల్ల సభ్యుల బ్యాంక్ అకౌంట్‌లు, లోన్ వివరాలతోపాటు వారికి సంబంధించిన ఇతర డేటా సరిగా లేదన్నారు. అందుకే నిజమైన లబ్ధిదారులను గుర్తించి, సభ్యులకు సంబంధించిన సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఖచ్చితమైన డేటా తీసుకోవడంద్వారా పేదరిక నిర్మూలనకు సహాయపడుతుందన్నారు. టిడ్కో ఇళ్లు నిర్మించిన చోటే వారు ఉపాధి పొందే విధంగా షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తే వారు పట్టణాలకు వచ్చే అవకాశం ఉండదని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఆవిధంగా చర్యలు చేపడతామన్నారు.

గత ప్రభుత్వం అమరావతి రాజధాని పనులపై అశ్రద్ధ వహించిందని, అప్పట్లో ఇచ్చిన టెండర్లకు కాలపరిమితి పూర్తి అయ్యిందని, అందుకే ఆ టెండర్లు రద్దు చేసి మరలా క్యాబినెట్ ఆమోదంతో టెండర్లు పిలుస్తామన్నారు. ఈ ప్రక్రియంతా నవంబర్ 15నుంచి డిసెంబర్ 15వరకు పూర్తై, జనవరి నుంచి రాజధాని పనులు మొదలుపెడతామని మంత్రి నారాయణ తెలిపారు. వర్క్‌షాపులో మెప్మా ఎండీ తేజ్ భరత్, అన్ని జిల్లాల పీడీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విశాఖ డెయిరీ భూ ఆక్రమణపై విచారణ జరిపించాలి

- రైతుల హక్కులను పరిరక్షించాలి
- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం (చైతన్యరథం): విశాఖ డెయిరీ రైతుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తూ స్వలాభం కోసం మాత్రమే పనిచేస్తోందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. బుధవారం నర్సీపట్నంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలు, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పాడి రైతులు ఆర్థికంగా అభ్యున్నతికి విశాఖ డెయిరీని అప్పటి పెద్దలు స్థాపించారని గుర్తుచేశారు. అయితే ఇప్పుడది పూర్తిగా వాణిజ్యరంగం వైపు మళ్లిపోయి రైతుల సంక్షేమాన్ని పక్కనబెట్టిం దని అయ్యన్న పేర్కొన్నారు. డెయిరీ తమ స్వలాభం కోసం ఆవు పాలు లీటరుకు రూ.3 తగ్గించినందుకు రైతులు తీవ్రంగా ఆందోళనకు దిగినట్లు చెప్పారు. ఈ నిర్ణ యం వల్ల సుమారు మూడు లక్షల మంది రైతులకు అన్యాయం జరుగుతుందని, లక్షల రూపాయలు నష్టపోతారని వివరించారు. ఈ నిర్ణయం రైతులపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని, అందరూ కలిసి దీనిపై స్పందించాలని రైతు సంఘాలను ఆయన కోరారు. విశాఖపట్నంలోని విలువైన 7.95 ఎకరాల భూమిని విశాఖ డెయిరీ ఆక్రమించిందని జనసేన నాయకుడు, విశాఖ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని అయ్యన్న వెల్లడించారు. దీనిపై కలెక్టర్ విచారణ చేపట్టి తక్షణ చర్యలు తీసుకోవాలని, రైతుల హక్కులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విశాఖ డెయిరీపై విచారణ చేయించాలని, ఆరోపణలు వాస్తవం అయితే వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని పార్టీల నాయకులు కూడా రాజకీయాలు పక్కన పెట్టి రైతుల సమస్యపై పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ వైద్యకళాశాలకు యల్లాప్రగడ పేరు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రతిపాదన - సానుకూలంగా స్పందించిన చంద్రబాబు

మంగళగిరి (చైతన్యరథం): ప్రపంచ ప్రఖ్యాత వైద్య శాస్త్రవేత్త, తెలుగుతేజం దివంగత యల్లాప్రగడ సుబ్బారావు పేరును ఏదైనా ప్రభుత్వ వైద్యకళాశాలకు పెట్టా లని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రతిపాదించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరాలు అందించారు. ప్రపంచానికి పలు ఔషధాలు అందించిన శాస్త్రవేత్త డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు స్వస్థలం భీమవరమని, చదువుకున్నది రాజమహేంద్రవరం అయినందున కొత్తగా ఏర్పడిన ఏలూరు, రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యకళాశాలల్లో ఏదైనా ఒక దానికి ఆయన పేరు పెడితే సముచితంగా ఉంటుందని కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి స్పందించి ఈ ప్రతిపాదనను పరిశీ లించాలని వైద్య ఆరోగ్య శాఖకు లేఖ రాశారు. సానుకూలంగా స్పందించి పరిశీ లించాలని సూచించినందుకు చంద్రబాబుకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. తొలి టెట్రాసైక్లిన్ యాంటీ బయాటిక్ 'అరియోమైసిన్'ను కనుగొన్నది యల్లాప్రగడ సుబ్బా రావే.. బోద వ్యాధి (ఫైలేరియా)కి సంబంధించి హెట్రజాన్, క్షయ వ్యాధి కట్టడికి 'ఐసోనికోటినిక్ ఆసిడ్ హైడ్రాజైడ్'ను రూపొందించారు.. క్యాన్సర్‌కు వాడే కీమోథెరపీ ఔషధాల్లో తొలితరం డ్రగ్ 'మెథోట్రెక్సేట్'ను మరో శాస్త్రవేత్తతో కలిసి అభివృద్ధి చేశా రు.. భారతీయులందరికీ గర్వకారణమైన శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావు అని పవన్‌కళ్యాణ్ ప్రశంసించారు.



## రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా అనిల్ చంద్ర పునేఠా



అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా అనిల్‌చంద్ర పునేఠా బుధవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పునేఠా (రిటైర్డ్ ఐఏఎస్)ను ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ కమిషనర్‌గా నియమించింది. అంతకుముందు పునేఠా 2019 వరకూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేశారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టకముందు పునేఠా సీసీఎల్ఏ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. 1984 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన పునేఠా కడప జిల్లా రాజంపేట సబ్ కలెక్టర్‌గా తన వృత్తిని ప్రారంభించి ఉమ్మడి రాష్ట్రంలో పలు కీలక శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ పోస్టు గతకొంత కాలంగా ఖాళీగా ఉండడంతో.. రెండు రోజుల క్రితం పునేఠాను కమిషనర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సోమవారం జారీ చేశారు. రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ హోదాలో అనిల్‌చంద్ర పునేఠా రెండేళ్లపాటు విధులు నిర్వహించనున్నారు. అంతకుముందు పునేఠా ఉత్తరాఖండ్ రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా మూడేళ్లపాటు విధులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవిన్యూ శాఖలో సిసియల్ఏ కమిషనర్‌గా పనిచేసిన కాలంలో పలు సంస్కరణలు చేపట్టి కేంద్ర ప్రభుత్వం నుంచి అనేక జాతీయస్థాయి అవార్డులు అందుకున్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలోను అనిల్‌చంద్ర పునేఠా రాష్ట్ర ప్రభుత్వ ప్రశంసలు పొందారు. ఇప్పటి వరకూ రాష్ట్రానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని విజిలెన్స్ కేసులను పరిష్కరించే అవకాశం ఉంటుంది. రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనిల్ చంద్ర పునేఠాను పలువురు అధికారులు, రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

# తిరుమలలో భక్తులకు ఒకరోజు అన్నదాన పథకం



- రూ.44 లక్షల విరాళం చెల్లించే దాతలకు అవకాశం
- వెంగమాంబ అన్నదాన భవనంలో దాతల పేర్ల ప్రదర్శన
- టీటీడీ అన్నప్రసాదం ట్రస్టు ఆధ్వర్యంలో నూతన పథకం

తిరుమల(చైతన్యరథం): తిరుమల శ్రీవారి దర్శనార్థం దేశ విదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులకు రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు అందించేందుకు టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టు ఒకరోజు విరాళం పథకం ప్రారంభించింది. ఈ పథకం కింద ఒకరోజు పూర్తిగా అన్నప్రసాద వితరణకు దాతలు రూ.44 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఉదయం అల్పాహారం కోసం రూ.10 లక్షలు, మధ్యాహ్న భోజనం కోసం రూ.17 లక్షలు, రాత్రి భోజనం కోసం రూ.17 లక్షలు విరాళం అందజేసే దాతలకు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించే అవకాశం కల్పించింది. విరాళం ఇచ్చిన దాత పేరును ఆ రోజు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో కూడా ప్రదర్శిస్తారు. దాతలు ఒకరోజు అన్నప్రసాద వితరణ చేయొచ్చు. ప్రస్తుతం తిరుమల వెంగమాంబ అన్నప్రసాద కాంప్లెక్స్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1, 2లోని కంపార్ట్‌మెంట్లు, బయటి క్యూలైన్‌లు, పీఏసీ-4 (పాత అన్నప్రసాదం), పీఏసీ-2, తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం, శ్రీనివాసం, విష్ణునివాసం కాంప్లెక్సులు, రుయా ఆసుపత్రి, స్విమ్స్, మెటర్నిటీ ఆస్పత్రి, బర్డ్, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి, తిరుచానూరు అన్నప్రసాద భవ నం, తిరుమల ఫుడ్ కౌంటర్లలో భక్తులకు దాతల విరాళాలతో ఉచితంగా అన్నప్రసాద వితరణ జరుగుతోంది.



రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. అనంతరం రూరల్ సమస్యలపై సీఎంకి విన్నవించారు.

## 31, 1న ప్రజావేదిక రద్దు

అమరావతి (చైతన్యరథం): దీపావళి పండుగ నేపథ్యంలో 31న గురువారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజావేదిక కార్యక్రమానికి సెలవు ప్రకటించారు. నవంబరు 1న రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా నిర్వహించే పింఛను పండుగ నేపథ్యంలో శుక్రవారం సైతం ప్రజావేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. సుదూర ప్రాంతాల నుంచి గ్రీవెన్స్‌కు హాజరవుతున్న ప్రజలు గమనించగలరు.

## మొవ్వ రామారావు మృతి బాధాకరం

**- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

అమరావతి(చైతన్యరథం): సుప్రసిద్ధ ఉద్యాన విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ మొవ్వ రామారావు మృతి బాధాకరమని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. వ్యవసాయ కళాశాల ప్రధానాచార్యులుగా, వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తగా ఎనలేని సేవలు అందించిన రామారావు నేటి తరం వ్యవసాయ అధికారులకు, వ్యవసాయ రంగంలో ఔత్సాహిక యువతకు ఆదర్శమని కొనియాడారు. తెగుళ్లు తట్టుకునే నూతన వంగడాలను సృష్టించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగ వంతుడిని ప్రార్థిస్తూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఈ దీపావళి రాష్ట్ర ప్రజలకు ప్రత్యేకం

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



అమరావతి (చైతన్యరథం): ఐదేళ్ల అవినీతి చీకట్లు తొలగిపోయిన నవ్యాంధ్రలో ప్రజలందరికీ ఈ దీపావళి పండుగ ఎంతో ప్రత్యేకమైనది. అవినీతి, అరాచక పాలనతో ఏర్పడిన చీకట్లను చీల్చుకుంటూ నవ్యాంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వెలుగులకు శ్రీకా రం చుట్టిన కూటమి ప్రభుత్వం తరపున దీపావళి పండుగ శుభాకాంక్షలు. గ్రామాల్లో ప్రారంభమైన అభివృద్ధి పనులు, రాష్ట్రానికి వస్తున్న నూతన ప్రాజెక్టులు, సమగ్ర అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో ఐదేళ్ల తర్వాత రాష్ట్రంలో నిజ మైన దీపావళి పండుగ వాతావరణం ఏర్పడింది. ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి పేదవాడి ఇంటా పండుగ జరగాలనే తలంపుతో ఈ దీపావళి పండుగ కానుకగా దీపం పథకాన్ని శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రారంభిస్తుండటం ఎంతో సంతోషంగా ఉంది. దీపావళి పండుగ వేళ ప్రతిఒక్కరి జీవితంలో శు భం కల గాలని కోరుకుంటున్నాను.

## ఇసుక అధిక ధరల అంతం.. చంద్రబాబు పంతం

***- ఉచిత ఇసుకపై జన ఆనందం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి***

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు రూరల్ టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన 'ఉచిత ఇసుకపై జన ఆనందం' కార్యక్రమంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఉచిత ఇసుక విధానంపై భవన నిర్మాణ కార్మికులు, బిల్డర్లు, నిర్మాణదారులు, ట్రాక్టర్ల యజమానులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలో ట్రక్కు ఇసుక ధర రూ.5 వేలు నుంచి రూ.6 వేలు ఉండేదని.. అయినా ఇసుక దొరికేది కాదన్నారు. ఇప్పుడు అదే ఇసుక రూ.1000కి వస్తోందన్నారు. వైసీపీ హయాంలో సీఎం జగనే ఇసుక వ్యాపారం చేశారని, ఎమ్మెల్యేలకు ప్రశ్నించే అవకాశం ఉండేది కాదని, ఏజెంట్లుని పెట్టుకుని ఇసుక వ్యాపారం నడిపించారని అన్నారు. వైసీపీ హయాంలో ఇసుక ట్రాక్టర్లకు లోడ్ చేసేవాళ్ళు కాదని, టిప్పర్లు లోడ్ చేసేవాళ్ళని ఎమ్మెల్యే కోటంరెడ్డి అన్నారు. ఎందుకంటే ట్రాక్టర్లు పేదోళ్ళవి.. టిప్పర్లు ముఖ్యమంత్రివి.. ఇసుక టిప్పర్లు టచ్ చేస్తే సీఎం కార్యాలయం నుంచి కాల్ చేసే వాళ్లని.. ఎస్పీలు, కలెక్టర్లు ఏజంట్లుగా పని చేశారని అన్నారు. 11 సీట్లు ఇచ్చి జనం ఛీ కొట్టి తిరస్కరించారని.. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వానికి వైసీపీ నేతలు సహకరించాలని సూచించారు. ఇసుక విషయంలో వైసీపీ మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. జగన్ పాలనలో ఇసుక విషయంపై ఎమ్మెల్యే, ఎంపీలకు మాట్లాడే హక్కు కూడా ఉండేది కాదన్నారు. జగన్ రాష్ట్రాన్ని దివాలా తీయిస్తే, చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు. ఇసుక కొల్లగొట్టి జగన్ ప్రజల నెత్తిన భారం పెట్టారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేరుస్తున్నారని.. 'ఇసుక అధిక ధరల అంతం.. చంద్రబాబు పంతం' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వ్యాఖ్యానించారు.



## చెడుపై మంచి విజయమే దీపావళి

**మంత్రి కందుల దుర్గేష్**



అమరావతి (చైతన్యరథం): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజల కు పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. టపాసుల వెలుగులు, దీప కాంతుల జ్యోతులు, సిరిసంపదల రాసులతో ఈ దీపావళి ప్రతి ఇంట సిరుల పంట కురిపించాలని ఆకాంక్షిస్తున్నా. ఒక్కొక్క దీపం వెలిగిస్తూ చీకట్లను పారదోలినట్లుగా.. ఒక్కొక్క మార్పు సాధించు కుంటూ బంగారు భవిష్యత్‌ను నిర్మించుకుందామని సూచించారు. ఈ దీపావళి మీ జీవితంలో వెలుగులు నింపాలని, పండగను ఆనందంగా జరుపుకోవాలని, టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు సూచించారు.

## ఢిల్లీలో నూతన ఏపీ భవన్ నిర్మాణం

**- టెండర్లను ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వం**

అమరావతి (చైతన్య రథం): ఢిల్లీలో నూతన ఏపీ భవన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ మొదలుపెట్టింది. 'రీ డెవలప్మెంట్ ఆఫ్ ఏపీ భవన్' పేరిట 11.53 ఎకరాల్లో నిర్మాణం కోసం డిజైన్లకు టెండర్లను ఆహ్వానించింది. 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్'ను వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని నోటిఫికేషన్ ఇచ్చింది. సాయంత్రంలోపు గుత్తేదారులు వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని అందులో పేర్కొంది. నవంబర్ 28లోపు ప్రతిపాదనలు సమర్పించాలని చెప్పింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఢిల్లీలోని ఏపీ భవన్‌ను విభజించారు. ఎన్నికలకు ముందు 2 తెలుగు రాష్ట్రాల అధికారులు చర్చించి భవన్ విభజనను ఖరారు చేశారు. 2 రాష్ట్రాల అధికారుల ప్రతిపాదనకు కేంద్ర హోంశాఖ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న భవనాలను తెలుగు రాష్ట్రాలు కలిసి వినియోగించుకుంటున్నాయి.

## జనవరి 5న గ్రూప్ -2 మెయిన్స్

అమరావతి: ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్షకు షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది జనవరి 5న 13 ఉమ్మడి జిల్లాల్లో ఈ పరీక్ష రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్షమంది వరకు పరీక్ష రాసే అవకాశముంది. డీఎస్సీ, ఎస్ఎస్సీ, ఇంటర్ బోర్డు పరీక్షలను దృష్టిలో ఉంచుకొని గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్ష తేదీని ఖరారు చేసినట్లు అధికారులు ప్రకటనలో తెలిపారు.



కొవ్వూరు పుష్కరాలు 2027కు సంబంధించిన ఏర్పాట్లను ఎంపీ దుగ్గుపాటి పురందేశ్వరి పరిశీలించారు. బుధవారం పుష్కర రేవులోని కొవ్వూరు గోష్పాదక్షేత్రం నుండి బోటులో పర్యటించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ప్రభుత్వాధికారులు కూటమి నేతలు పాల్గొన్నారు.



## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

◆ 33 బాధిత కుటుంబాలు రూ.18 లక్షల పైచిలుకు ముఖ్యమంత్రి ఆర్థిక సహాయం

నందిగామ (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అందించారు. మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం నందిగామ పట్టణంలోని తన కార్యాలయంలో ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు లబ్దిదారులు పాల్గొన్నారు.



## నరసరావుపేటలో పారిశుధ్య పనులను పరిశీలించిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట (చైతన్యరథం): పట్టణంలో పలుచోట్ల పారిశుధ్య పనుల పరిశీలనలో భాగంగా బుధవారం నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు పర్యటించారు. డంపింగ్ యార్డ్, గడియారస్తంభం, లింగంగుంట్ల శివాలయం, గాంధీ పార్క్ ప్రాంతాల్లో పర్యటించారు. గాంధీ పార్క్ నందు తెలుగు తల్లి విగ్రహ పనులను పరిశీలించిన ఆయన... త్వరగా విగ్రహం పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మున్సిపాల్ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో అండర్ గ్రౌండ్ సిల్ట్ పూడికతీత, కార్మికులకు డ్రెస్ బూట్లు టోపీలు అవసరమైన సామాగ్రిని అందించారు. పట్టణాన్ని సుందరంగా ఉంచడానికి పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అరవింద బాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జస్వంత్ రావు శానిటేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం 2024-26లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ నివాసంలో ఆయన చేతులమీదుగా తెలుగుదేశం సభ్యత్వాన్ని అందుకుంటున్న ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి తుమ్మల వెంకట చైతన్య... ప్రతిఒక్కరూ సభ్యత్వ నమోదు పొంది లబ్ధి పొందాలని, పార్టీ బలోపేతానికి సహకరించాలని చైతన్య కోరారు. సభ్యత్వ నమోదు పొందడం వల్ల రూ.5లక్షలు ప్రమాద బీమా అవకాశం ఉందన్నారు.

### కడప బ్రేక్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్‌రాజుపై

## చర్యలకు మంత్రి మండిపల్లి ఆదేశం

◆ రవాణా అధికారులు యూనిఫామ్ లేకుండా రోడ్డుపై కనబడితే కఠిన చర్యలు

◆ శాఖకు కీర్తి తెచ్చేలా విధులు నిర్వహించాలని మంత్రి హితవు



కడప (చైతన్యరథం): అధికారిగా ఉండి అక్రమ వసూళ్లకు పాల్పడటం హేయమైన చర్య అని, అధికారిని ప్రశ్నించడం పట్ల డ్రైవర్ల ఆవేదన అర్థమవుతుందని, కడప ఆర్టీవో ఆఫీస్ లో బ్రేక్ ఇన్ స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న విజయ భాస్కర్ రాజు అక్రమ డ్రైవర్లు వద్ద వసూళ్లకు పాల్పడుతూ ఉన్న వీడియో వైరల్ కావడం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేసారు. ఇటువంటి అధికారుల పట్ల తప్పని సరిగా చర్యలు తీసుకుంటామని, భవిష్యత్‌లో మరో అధికారి ఇలాంటి చర్యలకు తావు ఇవ్వకుండా చర్యలు ఉంటాయని, రవాణా అధికార్లు యూనిఫామ్ లేకుండా రోడ్డుపై కనబడితే కఠిన చర్యలు తప్పవని మంత్రి వెల్లడి చేశారు. రవాణా అధికారులు శాఖకు కీర్తి తెచ్చేలా విధులు నిర్వహించాలని అధికారులకు మంత్రి సూచన చేశారు. జరిగే ఘటనపై మంత్రి అరా తీశారు. తదుపరి చర్యల నిమిత్తం నియమాల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారితో పాటు దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎమ్‌ఈవో 1, రఘురామయ్య, ఎమ్‌ఈవో 2, రామాదేవి గారు, సర్వ శిక్షా అభియాన్ స్కూల్ రిసోర్ పర్సన్ గూపాలుని సుబ్రహ్మణ్యం ఉన్నారు.

## అర్హులైన వారందరికీ మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు

◆ కట్టెల పొయ్యి కష్టాలు తప్పించడానికే నాడు దీపం పథకం

◆ మూడు గ్యాస్ సిలిండర్ల ఉచిత పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం

◆ చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన బొండా ఉమా



విజయవాడ (చైతన్యరథం): అర్హులైన వారందరికీ దీపావళి పండుగను పురస్కరించుకుని మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. నాడు కట్టెల పొయ్యి కష్టాలు తప్పించేందుకే దీపం పథకాన్ని ప్రవేశపెట్టిన చంద్రబాబునాయుడు... నేడు మరోసారి పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు దీపం పథకం 2.0ను ప్రవేశపెట్టారని అందులో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దీపావళి కానుకగా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తున్నారని బొండా ఉమా వ్యాఖ్యానించారు. బుధవారం విజయవాడ నగరంలోని 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటలో దీపం పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మహిళలకు గ్యాస్ సిలిండర్‌లు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మొదటిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి శ్రీకారం చుట్టిన తెలుగుదేశం ప్రభుత్వం ప్రతి నాలుగు నెలలకు ఒకటి చొప్పున ఏడాదికి 3సిలిండర్లు ఉచితంగా అందించనున్నదని అన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో ఎప్పుడు అధికారంలోకి వచ్చిన సంతోషంగా ఉండేది ముందు రాష్ట్రంలోని మహిళలేనని, మహిళల కోసం తెలుగుదేశం ప్రభుత్వం అనేక పథకాలను, అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. 1995లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని మహిళలకు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారని తెలపారు. దీపావళి సందర్భంగా చెడు మీద మంచి గెలిచిన పండుగను ప్రతి ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలని గ్యాస్ సిలిండర్ బుక్ చేసిన ప్రతి మహిళకు వారి ఇంటికే ఉచితంగా తీసుకొని వచ్చే కార్యక్రమాన్ని నేటి నుండి మొదలు పెడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బోనీ నాని, ఎరుబోతు కనకారావు, దేవర సత్యనారాయణ, రాజు, ఎస్.కే ఖబీర్, మచ్చ ఇమాన్యుల్, సొంటి ఈశ్వరి, రాణి, శృతి, అబ్బాయమ్మ, అప్పుల సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంక్షేమానికి కృషి చేసేది టీడీపీనే

◆ టీడీపీ ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం)(: కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్ అన్నారు. తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం గుంటూరు తూర్పు నియోజకవర్గం స్థానిక 9 డివిజన్లో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ... కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అండని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడానికి ప్రజలు ఎంతో ఉత్సాహాన్ని చూపుతున్నారని గత ప్రభుత్వ వైసీపీ పాలనలో కక్షసాధింపు చర్యలతో చేసిన పాలనను ప్రజలు చిదరించుకున్నారని అన్నారు .పార్టీ సభ్యత్వం వల్ల ఎన్నో కుటుంబాలు ఎన్నో లాభాలు సమకూర్తాయని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కార్యకర్తలు ప్రజలు అభిప్రాయాలను తీసుకుంటూ పరిపాలన ముందుకు దూసుకెళ్తున్నారని తెలిపారు. పార్టీ సభ్యత్వం పొందిన వారికి 5 లక్షల వరకు బీమా సౌకర్యం ఉంటుందని, చనిపోయిన వారి కుటుంబాలకు మట్టి ఖర్చుల కింద 10వేల ఇవ్వడం కూడా జరుగుతుందన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు అధికంగా నమోదయ్యేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీ పాలనలో నిర్వీర్యమైపోయిన అన్ని వ్యవస్థలను చంద్రబాబులో పెడుతూ రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. పులివెందుల శాసనసభ్యులు జగన్మోహన్‌రెడ్డి తన తండ్రి ఆస్తి, తల్లికీ చెల్లికి లేకుండా తాను మాత్రమే అనుభవించాలనే స్వార్థంతో సొంత కుటుంబానికి అన్యాయం చేస్తున్నాడని తన తల్లికి చెల్లికి న్యాయం చేయలేని జగన్... రాష్ట్రానికి ఏ న్యాయం చేస్తాడని ఎమ్మెల్యే నసీర్ ప్రశ్నించారు. ప్రజలు జగన్మోహన్ రెడ్డి కల్లబొల్లి మాటలు నమ్మే పరిస్థితిలో లేరని తన చేతకాని పరిపాలన వల్ల రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ నాశనం చేశాడని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని ఆర్థికంగా, వ్యాపార పరంగా ఎన్నో పరిశ్రమలు తీసుకొచ్చి అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, అల్లం బాజీ, గూడూరు వాసు, కన్నబోయిన సాయి, సుబ్బారావు, వీర్రాజు, పున్నయ్య, జడ సురేష్, శేఖరు, అశోకు తదితరులు పాల్గొన్నారు.




# శోభాయమానం.. దీపావళి దీపోత్సవం!

**◆ దీపకాంతుల్లో దేదీప్యమానంగా అయోధ్య నగరి..!**

**◆ 25 లక్షల పైగా దీపాలతో గిన్నిస్ రికార్డు**

అయోధ్య: బాలరాముడు కొలువైన అయోధ్యలో దీపావళి సంబరాలు కన్నులపండువగా మొదలయ్యాయి. దీపకాంతుల్లో అయోధ్య నగరం దేదీప్యమానంగా వెలిగిపోయింది. సరయూ నదీ తీరంలో ఎనిమిదేళ్లుగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'దీపోత్సవం' ఈసారి మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. అయోధ్యలో భవ్య రామాలయం నిర్మాణం జరిగిన తర్వాత జరిగిన తొలి దీపోత్సవం ఇదే కావడంతో అయోధ్య నగరం దీపకాంతులతో మెరిసిపోయింది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 'దీపోత్సవ్'ను ప్రారంభించగా, భక్తులు ఏకకాలంలో 25 లక్షలకుపైగా దీపాలు వెలిగించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. సరయూ నది ఘాట్‌లో 1,100 మంది హారతులు ఇవ్వడం ద్వారా మరో సరికొత్త రికార్డు కూడా సిద్ధమైంది.

అయోధ్య పురవీధుల్లో లక్షలాది జనవాహిని మధ్య రామలక్షణ వేషధారులు రథంపై ఊరేగగా, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వయంగా రథం లాగి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. లేజర్ షోలు, డ్రోన్ షోలు, రామాయణ ఘట్టాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అయోధ్య మారుమోగింది. మయన్మార్, నేపాల్, మలేషియా, కంబోడియా, థాయ్‌లాండ్, ఇండోనిషా, భారతీయ కళా ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**కాంతులీనుతున్న అయోధ్య ..**

రామాలయ నిర్మాణం తర్వాత జరిగిన తొలి దీపోత్సవ్‌ను యోగి ఆదిత్యనాథ్ ప్రారంభిస్తూ, ఈనాటి దీపోత్సవ్ మనందరికీ గర్వకారణమని అన్నారు. ఇది మనమంతా జరుపుకుంటున్న శివ దీపోత్సవమని అన్నారు. ఎనిమిదేళ్ల క్రితం తొలి దీపోత్సవ్ జరుపుతున్నప్పుడు.. యోగిజీ రామమందిరం నిర్మించండని ప్రతిఒక్కరూ అడిగేవారని, రాముడు త్వరలోనే మనందరినీ ఆశీర్వదిస్తాడని ఆరోజు చెప్పడం జరిగిందని గుర్తుచేశారు. రామాలయ నిర్మాణం కల సాకారమైనందుకు ప్రధాని మోదీకి మనమంతా కృతజ్ఞతలు చెప్పుకోవాలని అన్నారు. యావద్దేశం కోవిడ్ మహమ్మారితో పోరాడుతున్న సమయంలో ప్రధాని అయోధ్యకు వచ్చి రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని అన్నారు. ఈరోజు అయోధ్య వెలిగిపోతోందని, ఇవాళ వెలుగుతున్నవి కేవలం దివ్వెలు కావని, సనాతన ధర్మ విశ్వాసమని చెప్పారు. "ఈరోజు మన కాశీ వెలిగిపోతోంది. భవ్య కాశీని ఈరోజు యావత్ ప్రపంచం చూస్తోంది" అని గర్వంగా చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షేకావత్‌తో కలిసి టూరిజం యాప్‌ను, అయోధ్య మేయర్ రాసిన ఒక పుస్తకాన్ని యోగి ఆదిత్యనాథ్ విడుదల చేశారు.

# మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వ్యూహం!

**◆ హర్యానా తరహాలో స్థానిక నేతలకే ప్రచార బాధ్యతలు**

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల గడువు మంగళవారం ముగియడంతో ఎన్నికల ప్రచారం ఒక్కసారిగా ఊపందుకుంటోంది. మహాయుతి కూటమి, మహా వికాస్ అఘాడి తమ అగ్రనేతలను ప్రచారబరిలోకి దింపుతున్నాయి. 50కి పైగా బహిరంగ సభల్లో బీజేపీ అగ్రనేతలు పాల్గొనేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ప్రముఖులు ఈ బహిరంగ సభల్లో పాల్గొంటారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెస్ట్ మహారాష్ట్ర, విదర్భ, ముంబై-కొంకణ్, నార్త్ మహారాష్ట్ర, మరాఠ్వాడాల్లో 8 బహిరంగ సభల్లో పాల్గొంటారు. ఎక్కువ బహిరంగ సభల్లో పాల్గొనే బాధ్యత దేవేంద్ర ఫడ్నవిస్, నితిన్ గడ్కరి, చంద్రశేఖర్ బవాంకులేకి అప్పగించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వివిధ జిల్లాల్లో 15 ర్యాలీల్లో పాల్గొంటారు. ఆయనతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. వీరితో పాటు స్థానిక నేతలు సైతం పలు ర్యాలీలు నిర్వహించనున్నారు.

**అత్యధిక ర్యాలీల నిర్వహణ ఫడ్నవిస్‌కే**

పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, కేంద్రం మంత్రి అమిత్‌షా 20 ర్యాలీలు, నితిన్ గడ్కరి 40 ర్యాలీలు నిర్వహించనుండగా, దేవేంద్ర ఫడ్నవిస్ 50 ర్యాలీలు నిర్వహిస్తారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బవాంకులే 40 ర్యాలీలు నిర్వహిస్తారు.



**హర్యానా తరహాలోనే..**

హర్యానా ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాన్నే మహారాష్ట్ర ఎన్నికల్లోనూ అనుసరించాలని బీజేపీ వ్యూహంగా ఉంది. హర్యానాలో మోదీ, అమిత్‌షా కొన్ని ర్యాలీల్లోనే పాల్గొని ప్రచారం సాగించారు. ఎక్కువ ర్యాలీలు స్థానిక నేతలే నిర్వహించారు. హర్యానాలో కమలనాథుల వ్యూహం ఫలించింది. ఊహించిన దానికంటే ఎక్కువ సీట్లలో గెలిచి, వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఘనతను బీజేపీ దక్కించుకుంది.

ఇదిలావుండగా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో నవంబర్ 20న జరుగనున్నాయి. నవంబర్ 23న కౌంటింగ్ జరిపి ఫలితాలు ప్రకటిస్తారు. ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన, అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్‌సీపీతో కలిసి బీజేపీ మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే పట్టుదలతో ఉంది. కాగా, మహారాష్ట్రలో ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు రాబట్టిన 'మహా వికాస్ అఘాడి' ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయనే నమ్మకంతో ఉంది.




# దీపాలు చాలు.. బాణసంచా వద్దు

**◆ కాలుష్యం నివారిద్దాం**

**◆ ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ పిలుపు**

న్యూఢిల్లీ: దేశమంతటా దీపావళి సంబరాలు జరుపుకోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో బాణసంచాపై ఉన్న నిషేధాన్ని పునరుద్ఘాటించారు. బాణసంచాపై ఆంక్షలు ఏ మతానికి సంబంధించినది కావని, ప్రజారోగ్యానికి సంబంధించిన అంశమని అన్నారు. దీపావళి అనేది మౌలికంగా దీపాలను వెలిగించే పండుగని, బాణసంచా వల్ల వచ్చే కాలుష్యం ముఖ్యంగా పిల్లల్లో ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని బుధవారం నాడిక్కడ మీడియా సమావేశంలో తెలిపారు. ఇది హిందూ, ముస్లింలకు సంబంధించిన అంశం కాదని, పండుగ ప్రధాన స్ఫూర్తి దీపకాంతులను వెదజల్లడమే కానీ, పొగను వ్యాపింపజేయడం కాదని కేజ్రీవాల్ అన్నారు. కాలుష్యం విషయానికి వచ్చినప్పుడు సంప్రదాయం కంటే ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. "సుప్రీంకోర్టు, హైకోర్టు సైతం కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని బాణసంచా కాల్చరాదని, దీపాలు వెలిగించాలని చెప్పాయి. దీపావళి అంటే దీపాల పండుగే కానీ బాణసంచా కాల్చడం కాదు. మనం ఎవరి కోసమే కాదు, మనకోసం, మన కుటుంబం మేలు కోసం బాణసంచాకు దూరంగా ఉండాలి."

# శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

**◆ మూడు విమానాల్లో క్షుణ్ణంగా తనిఖీలు**

హైదరాబాద్: గత కొద్ది రోజులుగా దేశవ్యాప్తంగా విమానాలకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. తాజాగా బుధవారం శంషాబాద్ విమానాశ్రయానికి బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఎయిర్ ఇండియా, ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీంతో అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు. మూడు విమానాల్లో తనిఖీలు నిర్వహించారు. కాగా దేశ వ్యాప్తంగా విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్ వస్తుండటం సంచలనం సృష్టిస్తోంది.

నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. హైదరాబాద్ నుంచి చండీగఢ్ వెళుతున్న ఇండిగో విమానంలో బాంబ్ పెట్టామని గుర్తుతెలియని వ్యక్తులు విమానయాన సిబ్బందికి ఫోన్ చేసి బెదిరించారు. అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ భద్రత సిబ్బంది విమానంలో తనిఖీలు చేపట్టారు. విమానంలో ఉన్న 130 మంది ప్రయాణికులను కిందకు దింపి తనఖీ చేశారు. ఇప్పుడు తాజాగా మళ్లీ బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో ప్రయాణీకులు భయాందోళన చెందుతున్నారు.




అయితే శంషాబాద్ ఒక్కటే కాదు.. భారత్‌కు చెందిన వివిధ విమానాలకు వారం రోజుల వ్యవధిలో భారీగా బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. బెదిరింపు ఫోన్ కాల్స్ ఎవరు చేస్తున్నారో కనిపెట్టేందుకు తమకు సహకరించాలని ఎక్స్, మెటా యాజమాన్యాన్ని కోరింది. సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులు చేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని ఎక్స్ యాజమాన్యాన్ని ప్రశ్నించింది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా బెదిరింపులకు పాల్పడిన వారిని నో ఫ్లైయింగ్ లిస్టులో చేర్చుతామని, అందుకు అనుగుణంగా చట్టంలో మార్పులు చేస్తామని చెప్పారు.